క్లుప్తంగా

హాస్టల్ స్థలాన్ని కాపాడాలని నిరసన



ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘాలు, సీపీఐ నాయకులు

ఉరవకొండ: స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయం పక్కనే ఉన్న గాంధీ హరిజన హాస్టల్ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని దళిత సంఘాలు, సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం వంటవార్పు నిర్వహించి, నిరసన తెలియజేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట చాబాల సర్పంచ్ జగదీష్ అధ్యక్షతన జరిగిన నిరసనలో హరిజన హాస్టల్ కమిటీ అధ్యక్షుడు గుంట్రాయప్ప, డీజీహెచ్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు మీనుగ గోపాల్, ఎస్సీ, ఎస్టీ సంఘాల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, పాల్తూరు ఆనందరాజు మాట్లాడారు. పాత హాస్టల్ భూమి కబ్జా చేసిన బూశెట్టి గోవిందప్పశెట్టి, దండా నారాయణస్వామి, వీరారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందించారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రాధాన్యత ఇవ్వండి



పుష్‌కార్టులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలోని వార్డుల్లో పారిశుధ్యం మెరుగునకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రూ.12 లక్షల నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన నూతన పుష్‌కార్టులు, డస్ట్‌బిన్లు, మరమ్మతు చేసి పరికరాలను కార్మికులకు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి తనవంతు కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు శ్రీనివాసవాయాదవ్, వలీబాషా, డీఈ రవిప్రకాష్‌నాయుడు, కౌన్సిలర్లు శారదాదేవి, గౌని లావణ్య, ప్రశాంతి, జ్యోతి, పొరాళ్ల గోవిందరాజులు, సంజీవప్ప, శ్రీనివాసరెడ్డి, డిష్ గోవిందు, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఇఫ్తార్ విందు



ఆత్మకూరు వీధిలో జరిగిన ఇఫ్తార్‌కు హాజరైన ముస్లింలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో సోమవారం సాయంత్రం జరిగిన సామూహిక ఇఫ్తార్ విందుకు భారీ సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. కాలనీకి చెందిన ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, బ్రెడ్ శర్మాస్, అబ్దుఖయ్యూం, హాజీ ఎం.బాషా, అబ్దుల్ హమీద్, ఆడిటర్ అబుబక్కర్, అహ్మద్ హుస్సేన్, లడ్డు మహమ్మద్, షఫీ, నిజాముద్దీన్, యువకుల ఆధ్వర్యంలో సామూహిక ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఓబుళాచారీ రోడ్డులోని మక్కా మసీదులో సామూహిక ఇఫ్తార్ విందు నిర్వహించారు.

అన్ని రంగాల్లో రాణించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఖాజాహుస్సేన్

విడపనకల్లు: ప్రస్తుత సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ అన్నారు. సోమవారం మాళాపురంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో బాలికలు వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ తులసీప్రియ పాల్గొన్నారు.

ద్రాక్షపండ్లతో అలంకరణ



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు జరిగాయి. ద్రాక్ష పండ్లతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అర్చకులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.







పెన్నహోబిలం వద్ద నిరుపయోగంగా మారిన నీటి తొట్టె , నీటితొట్టెలు లేకపోవడంతో ఉరవకొండ సమీపంలో హంద్రీనీవా కాలువలోకి దిగి దాహార్తి తీర్చుకుంటున్న గేదెలు

నీరులేక మూగ రోదన



- గ్రామాల్లో నిరుపయోగంగా నీటి తొట్టెలు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో వినియోగంలోకి రాని వైనం
- పశువుల దాహార్తి తీర్చేందుకు రూ.లక్షలు వ్యయం

ఉరవకొండ: అసలే వేసవి కాలం.. ఎండలు మండుతున్నాయి.. మేతకోసం వెళ్లిన పశువులకు ఎక్కడా చుక్కనీరు దొరకడంలేదు. గ్రామీణ ప్రాంతాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నీటితొట్టెలు నిరుపయోగంగా మారాయి. తొట్టెల్లో నీరు నింపేవారులేరు. నీరులేక మూగజీవాలు అల్లాడుతున్నాయి. పలు గ్రామాల్లో నీటి తొట్టెలు వినియోగించకపోవడంతో వాటి చుట్టూ ముళ్ల కంపలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత నీటి తొట్టెల విషయంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.25 వేలు వెచ్చించి నీటి తొట్టెల నిర్మాణం: ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని 15 మండలాల పరిధిలో 289 నీటి తొట్టెలు నిర్మించారు. వీటి నిర్వహణ బాధ్యత పశుసంవర్ధక శాఖకు అప్పగించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఒక్కో గ్రామంలో ఒక్కో నీటి తొట్టెను సుమారు రూ.25 వేలు



వజ్రకరూరు సమీపంలోని ఓ పొలంలో గుంతలో నీటిని తాగి దాహార్తి తీర్చుకుంటున్న ఆవులు

నీటి తొట్టెల వివరాలు ఇలా:

నియోజకవర్గం	మండలాలు	నీటి తొట్టెలు
ఉరవకొండ	5	90
రాయదుర్గం	5	98
కళ్యాణదుర్గం	5	101

వెచ్చించి నిర్మించారు. ఇంటిగ్రేటెడ్ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం (ఐడబ్ల్యూఎంపీ) ఉపాధి హామీ పథకం, గ్రామ పంచాయతీ నిధులతో 2018–19లో వీటిని నిర్మించారు.

శిథిలావస్థకు చేరిన నీటి తొట్టెలు: పశువుల దాహార్తి తీర్చేందుకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. పశు పోషకులు పశువులకు మేత కోసం తీసుకెళ్లి నీటి తొట్టెల వద్దకు తెచ్చి వాటి దాహార్తి తీర్చేకునేలా చేసేవారు. ప్రస్తుతం నీటి తొట్టెల్లో నీళ్లు నింపే వారు లేరు. నీటి తొట్టెల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కొన్ని గ్రామాల్లో నీటి తొట్టెలను ధ్వంసం చేసి, ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారు. కొన్ని నీటి తొట్టెలు బీటలు వారి ఎరువుల దిబ్బల కోసం వినియోగించుకుంటున్నారు. పశుపోషకులు, కాపరులు కిలోమీటర్ల దూరం వెళ్లి చెరువులు, బోరుబావుల వద్దకు వెళ్లి పశువులకు నీళ్లు తాపించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నీటి తొట్టెలను వినియోగంలో తీసుకోరావాలని పశుపోషకులు, కాపరులు కోరుతున్నారు.

పంచాయతీలదే బాధ్యత



నీటి తొట్టెల నిర్వహణ బాధ్యత ఆయా పంచాయలదే. గతంలో వీటి నిర్వహణ పశుసంవర్ధక శాఖ నిర్వహించింది. ప్రస్తుతం నీటితొట్టెల్లో నీళ్లు నింపే బాధ్యత పంచాయతీలకే అప్పగించాం. పశువుల దాహార్తిని తీర్చే విధంగా వాటిని వినియోగంలో తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతాం.

– రవిప్రసాద్, ఎంపీడీఓ, ఉరవకొండ

ఘనంగా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి జన్మదిన వేడుకలు



ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు అందిస్తున్న పార్టీ నాయకులు



కొనకొండ్లలో చలివేంద్రాన్ని ప్రారంభించిన భీమా యూత్ నాయకులు

ఉరవకొండ: పట్టణంలో శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పార్టీ నాయకులు, శివరామిరెడ్డి అభిమానులు కేక్ కట్ చేశారు. అంతకుముందు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ విజయ్‌కుమార్, తిప్పారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం అలుపెరగని పోరాటాలు చేస్తూ నియోజకవర్గ ప్రజల హృదయాల్లో నిలిచిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. నాయకులు చిన్నముష్టూరు ఎర్రిస్వామి, సర్పంచ్ రామాంజనేయులు, శిలార్‌మగ్బూల్, అన్నలయ్య రఫు, హనమంతు, నబి, పెద్దన్న, ఉండబండ ఎర్రిస్వామి,మస్తాన్ పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి జన్మదినం సందర్భంగా భీమా యూత్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం భీమా యూత్ నాయకులు మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో భీమా యూత్ నాయకులు రాజ శేఖర్‌యాదవ్, సురేష్, మల్లికార్జున, దినేష్, రామకృష్ణ, హరికృష్ణ, కొత్తపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీగా ఈడిగ ప్రసాద్‌ను బలపరచండి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: ఉరవకొండ వైస్ ఎంపీపీగా ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్‌ను మెజార్టీ ఎంపీటీసీలు మద్దతు తెలిపి బలపరచాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. సోమవారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో వైస్ ఎంపీపీ ఎన్నికపై ఎంపీటీసీలతో మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడారు. ఈసందర్భంగా ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశ్వ మాట్లాడారు. వైస్ ఎంపీపీగా పార్టీ ఈడిగ ప్రసాద్ పేరును నిర్ణయించిందని, ఎంపీటీసీలందరూ ఈడిగ ప్రసాద్‌ను బలపరచాలన్నారు. ఎన్నికల్లో 20 మంది ఎంపీటీసీలు మనవారే ఉన్నారని, ఏకపక్షంగా వైస్ ఎంపీపీ పీఠం కూడా మనదే అవుతుందన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎంపీటీసీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పట్టణ, రూరల్, మండల సమన్వయ కర్తలు ఈడిగ ప్రసాద్, ఎర్రిస్వామిరెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, యోగేంద్రరెడ్డి, లత్తవరం గోవిందు పార్టీ పట్టణ, రూరల్ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా బోరుబావి తవ్వుతున్నాడని ఫిర్యాదు



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: దౌర్జన్యంగా బోరుబావి తవ్వుతున్నారని రాంపురానికి చెందిన కాడెన్న ఆర్డీఓ వసంతబాబుకు ఫిర్యాదు చేశాడు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, నాయకులతో కలిసి ఫిర్యాదు చేశాడు. కాడెన్న మాట్లాడుతూ తాను, సోదరుడు రామాంజనేయులు వేర్వేరుగా బోర్లు వేసుకొని వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపాడు. ఇటీవల తనకు తెలియకుండా నేలమట్టమైన బోరును తెరిచేందుకు యత్నించగా రెవెన్యూ, పోలీసుల అధికారుల సాయంతో నిలుపుదల చేశామన్నారు. ఆర్డీఓ వసంతబాబు స్పందిస్తూ అక్కడే ఉన్న తహసీల్దార్ భాస్కర్, మండల సర్వేయర్లకు వెంటనే పొలాన్ని పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై అర్జీలను ఆర్డీఓ స్వీకరించారు.

విమానాశ్రయానికి భూములు ఇచ్చేదిలేదు

- బలవంతంగా తీసుకుంటే ఆత్మహత్యలే శరణ్యం
- తెగేసి చెప్పిన తలుపూరు రైతులు



సమస్యను చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన రైతులు

అనంతపురం అర్బన్: 'మా ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటవుతుందని, ఇందుకోసం వ్యవసాయ భూములు తీసుకుంటారనే ప్రచారం మమ్మల్ని ఆందోళనకు గురి చేసింది.. మేము వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాం ..విమానాశ్రయానికి ఎట్టిపరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేదిలేదు.. బలవంతంగా తీసుకోవాలని చూస్తే ఆత్మహత్యలు తప్పవు' అంటూ తలుపూరుకు చెందిన రైతులు తేగేసి చెప్పారు. తమ సమస్యను చెప్పుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. రైతులు శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, చాకలి లక్ష్మన్న, వరలక్ష్మి, తదితరుల విలేకరులతో మాట్లాడారు. తలుపూరులో 1,100 ఎకరాలు, అనంతపురం రూరల్ మండలం సజ్జలకాలువలో 102 ఎకరాలు, బాపనపల్లిలో 378 ఎకరాల వ్యవసా య భూములు విమానాశ్రయానికి తీసుకుంటున్నట్లు, అధికారులూ సర్వే చేసినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. భూములు కోల్పోతే తమకు జీవనాధారం లేదన్నారు. తలుపూరులో దాదాపు 400 ఎకరాలకు పైగా ఉద్యాన పంటలు పండిస్తున్నట్లు తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటు చేయాలనుకుంటే వేరే ఎక్కడైనా ప్రభుత్వ భూమి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం, అధికారులు బలవంతంగా తీసుకునే ప్రయత్నం చేస్తే ఆత్మహత్యలు తప్ప మరో మార్గం లేదన్నారు. అనంతరం జేసీ శివ్ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. రైతులు సదాశివరెడ్డి, రమేష్‌రెడ్డి, మహిళ రైతులు సునీత, లలిత, మంజుల పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి హానికరం



మాట్లాడుతున్న ఆర్డీటీ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, పక్కనే స్పానిష్ దేశస్తురాలు ఆరొంబా

కూడేరు: ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి , జీవరాశులకు, మానవ ఆరోగ్యానికి హానికరమని స్పానిష్ దేశస్తురాలు అరొంబా, ఆర్డీటీ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం పి.నారాయణపురంలో సర్పంచ్ హనుమంతరెడ్డి అధ్యక్షతన ఆర్డీటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరొంబా, ఆర్డీలు రాజశేఖర్ రెడ్డి , కృష్ణవేణి మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం సహకరించాలని కోరారు. ఇలాగే ప్లాస్టిక్ వాడితే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్ కవర్లను వృథాగా బయటపడేయొద్దని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పదోతరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

కూడేరు: స్థానిక కేజీబీవీ పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నారప రెడ్డి తనిఖీ చేశారు. సోమవారం పదోతరగతి గణితం పరీక్ష జరిగింది. విద్యార్థులకు నీరు, వైద్య సదుపాయాలు కల్పించారా? అని ఆరా తీశారు. కేజీబీవీలో 114 మంది పరీక్షలు రాశారు. హైస్కూల్‌లో 200 మంది పరీక్షలు రాశారని, మొత్తం నలుగురు గైర్హాజరయినట్లు ఎంఈఓ–1,2లు మహమ్మద్ గౌస్, సాయికృష్ణ తెలిపారు.

నాటుసారా పట్టివేత

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని కాపర్లపల్లికి చెందిన గోవింద్ నాయక్ నుంచి ఎక్సైజ్ పోలీసులు సోమవారం 21 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ హసీనా బాను, ఎస్‌ఐ సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కంబదూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో 2025–26 విద్యా సంవత్సరం ఆరోతరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌ఓ రూప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గుండెపోటుతో హెడ్మాస్టర్ మృతి



హెడ్మాస్టర్ మురహరి

గుమ్మఘట్ట: మండలంలోని గొల్లపల్లి జెడ్పీ ఉన్నత ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మురహరి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు,ఉపాధ్యాయులు తెలిపిన మేరకు.. మురహరికి ఆదివారం రాత్రి ఛాతీలో నొప్పి రావడంతో మాత్ర వేసుకొని నిద్రించాడు. ఉదయం మురహరి భార్య నిద్రలేపేందుకు ప్రయత్నించగా అప్పటికే ప్రాణాలతో లేరు. పలువురు ఉపాధ్యాయులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురహరి మృతదేహం వద్ద ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు పూలమాల వేసి, నివాళులర్పించారు.

నేడు వారపు సంత

కళ్యాణదుర్గం రూరల్: వారపు సంత, బస్టాండ్, లారీ స్టాండ్, రోడ్డు మార్జిన్‌కు సంబంధించి 2025–26 సంవత్సరం సుంకం వసూలుకు మంగళవారం వేలం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వంశీ తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

బొమ్మనహాళ్: త్రైత సిద్ధాంతం– ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీత ప్రచారం చేశారు. మండల కేంద్రంలో త్రైత సిద్ధాం, ప్రబోధ సేవాసమితి అధ్యక్షులు రామాంజనేయులు, సభ్యులు బాలు, విష్ణు, శివ, వీరేంద్ర, సుమతి, సువర్ణ, లక్ష్మీ, హేమ, వరలక్ష్మీ, సుజాత, చందు పాల్గొన్నారు.

వినతులు కరువు

కూడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరువైంది. ప్రజలు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావేదికకు వెళ్తున్నారు. ఒకటిరెండు అర్జీలు వస్తే డీటీ సూర్య ప్రతాప్ స్వీకరించారు. హౌసింగ్ డీఈ హనుమప్ప, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏపీఎం దేవానంద ఫిలిప్స్‌న్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రథం తయారీకి విరాళాలు

కూడేరు: స్థానిక జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ నూతన రథం తయారీకి దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం సంగమేశ్వర స్కూల్ కరస్పాండెంట్ లోకనాథ్, అనసూయమ్మ దంపతులు రూ.25,555 విరాళం అందించారు. పలువురు దాతలు సుమారు రూ.లక్ష వరకు విరాళం అందించారు.

విశిష్ట నంబర్ ఉంటేనే సంక్షేమ లబ్ధి

కూడేరు: మండల వ్యాప్తంగా 12,171 మంది రైతులుంటే 2,755 మందే విశిష్ట నంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఏఓ విజయ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విశిష్ట నంబర్ రిజిస్ట్రేషన్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. రైతు సేవా కేంద్రాల వారిగా విశిష్ట నంబర్ రిజిస్ట్రేషన్ పై ఆరా తీశారు. అనేక గ్రామాల్లో చాలా మంది రైతులు విశిష్ట నంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందని, విశిష్ట నంబర్ ఉంటేనే ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరుతుందనితెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

గవిమఠం హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్ర స్వామి, సహాయ కమిషనర్ కె.రాణి, పర్యవేక్షణ అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ కానుకల ద్వారా రూ.1,78,175 తో పాటు 50 గ్రాముల వెండి వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో గవిమఠం జూనియర్ అసిస్టెంట్లు గోపి, నారాయణస్వామి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి



మృతి చెందిన గొర్రె పిల్లలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని నారాయణపురంలో కుక్కల దాడిలో రైతు రామచంద్ర అనే వ్యక్తికి చెందిన 20 గొర్రె పిల్లలు సోమవారం మృతి చెందాయి. గ్రామ సమీపంలోని కళ్లంలో వదిలిన గొర్రెపిల్లలపై కుక్కలు దాడి చేశాయన్నారు. సుమారుగా రూ.80 వేలు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం



కళ్యాణదుర్గంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేశ్



రాయదుర్గంలో క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది



శ్రీధరఘట్టలో క్షయపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు

కళ్యాణదుర్గం: సమష్టి కృషితో క్షయ వ్యాధిని నిర్మూలిద్దామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేశ్ సూచించారు. సోమవారం క్షయ వ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి టీ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. డాక్టర్ రాజేశ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది అంగన్‌వాడీలతో కలిసి క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. వారికి అవసరమైన మందుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి పవన్, బ్యాంక్ మేనేజర్ విజయ్, టీబీ సూపర్‌వైజర్లు సత్యనారాయణ, శివకుమార్, సిబ్బంది తేజశ్విని, పీపీఎస్ఏ తిమ్మరాజు, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, రాష్ట్ర ఎన్జీఓ అధ్యక్షులు మాధవ, రెడ్స్‌ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎన్జీఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి శాశ్వత జబ్బు కాదు

రాయదుర్గంటౌన్: క్షయవ్యాధి శాశ్వత జబ్బుకాదని, ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రభుత్వ ఏరియా వైద్యాధికారిణి మెర్సీ జ్ఞానసుధ, టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ రమేష్ తెలిపారు. సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ (టీబీ) నివారణ దినాన్ని నిర్వహించారు. స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద క్షయ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ చేసి, అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ శ్రీకాంత్‌నాయక్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు యశ్వంత్‌రాజ్, హోమియో మెడికల్ వైద్యురాలు నాగజ్యోతి, నర్సింగ్ సూపరింటెండెంట్ రమణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్‌బాబు, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, అల్తాఫ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, ఎస్ఎస్ఎంలు పాల్గొన్నారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

బొమ్మనహాళ్: గ్రామాల్లోని ప్రజలు క్షయపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు శ్రావణ్‌కుమార్, గీతా భార్గవి తెలిపారు. సోమవారం బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట ఆరోగ్య కేంద్రాల్లో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ రెండు వారాలపాటు దగ్గు, జ్వరం తగ్గకపోవడం , శరీరం బరువు తగ్గడం తదితర లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సీహెచ్ఓ రాజశేఖర్, ఉమాదేవి, వైద్య సిబ్బంది శివప్రసాద్, బాలాజీ, ఆర్థర్‌బాబు, మాధవి, అరుణ, ఇస్మాయిల్, భారతి పాల్గొన్నారు.



ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌వీఎస్ చౌదరి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినీతల ఆధ్వర్యంలో క్లాక్ టవర్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేశారు. డాక్టర్ చౌదరి, డాక్టర్ వినీతలు మాట్లాడుతూ క్షయ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, దాని లక్షణాలు , జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో క్షయ సూపర్‌వైజర్ కుళాయమ్మ, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ మాణిక్యరావు, ల్యాబ్ టెక్నీషియన్ కైలాసం, ఐసీటీసీ కౌన్సిలర్ రవిప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎస్ఎంలు పాల్గొన్నారు.